

సయ్యద్ ముఖరంచాన్‌కు డాక్టరేట్



రాజంపేట అర్బన్ : పట్టణానికి చెందిన సయ్యద్ ముఖరంచాన్ డాక్టరేట్ అందుకున్నారు. తమిళనాడులోని హూసూరు క్లారిష్ట హోటల్‌లో ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు ఎంతో ప్రతిష్టాత్మకంగా డాక్టరేట్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులు విజయ ఫౌండర్ అండ్ హెడ్‌కోచ్ వి. బాబు, మాజీ ఎమ్మెల్యే కె. మనోహరన్, ఎపి విశ్రాంత అసిస్టెంట్ జడ్జి హరిదాస్ చేతుల మీదుగా ముఖరం చాన్ అవార్డును అందుకున్నారు. 2019లో జనసేన పార్టీ తరపున పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన సయ్యద్ ముఖరం చాన్‌కు పొలిటికల్, సేవారంగంలో అద్భుతమైన సేవలను అందించినందుకు గాను డాక్టరేట్ అందజేశారు. తన సేవలను గుర్తించి తనకు డాక్టరేట్ ప్రదానం చేయడం సంతోషకరంగా ఉందని, ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ఈ అవార్డు తనకు ఉత్సాహాన్నిస్తుందని తెలిపారు.

రబీలో గణనీయంగా

తగ్గిన వేరుశనగ దిగుబడి

- కొనుగోలుకు ముందుకు రాని ప్రభుత్వం

-నాణ్యత, పరిమాణం పేరుతో ప్రయివేట్ వ్యాపారుల ఇష్టారాజ్యం



వేరుశనగ కాయలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈ ఏడాది రబీ సీజన్‌లో బోరు బావుల కింద సాగు చేసిన వేరు శనగ దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఈ నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందో ళన చెందుతున్నారు. గత ఏడాది నవంబర్‌లో రైతులు అధిక దిగుబనిచ్చే 1812, కదిరి లేపాక్షి, 1694, ట్యాగ్, గిరినార్-4 రకాల విత్తనాలను సాగు చేశారు. ఈ విత్తనాలకు సంబంధించి దాదాపు నాలుగు నెలల 20 రోజుల అనంతరం పంట దిగుబడి చేతికొచ్చే అవకాశం ఉంది. అయితే ఈ ఏడాది పంట సాగు చేసినప్పటి నుంచి వర్షం కురువకపోవడంతో పంట దిగుబడి తగ్గిందని రైతులు చెబు తున్నారు. మండల వ్యాప్తంగా 1,320 ఎకరాలలో ఏడాది పంటను సాగు చేశారు. ఎకరాకు రూ30 నుంచి రూ.40 వేలు పెట్టుబడులు అయ్యాయని రైతు లు చెబుతున్నారు. ఎకరాకు కేవలం 10 నుంచి 15 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా రబీ సీజన్‌లో సాగు చేసే వేరుశనగకు ఆధునిక వంగడాలైన ఈ రకాలు విత్తనం వేస్తే ఎకరాకు 40 నుంచి 50 బస్తాలు దిగుబడి రావాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

కొనుగోలుకు ముందుకు రాని ప్రభుత్వం..

గతంలో రబీ సీజన్‌లో సాగుచేసిన వేరుశనగ పంట ఉత్పత్తులను ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ మద్దతు కోసం కొనుగోలు చేసేది. అయితే ఈ ఏడాది ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తుంది. దీంతో దళారులు ఆడింది ఆట.. పాడింది పాటగా ఉంది. ధరలను అమాంతంగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. 43 కిలోల బస్తా నాణ్యత, పరిమాణం ఆధారంగా రూ.2000 నుంచి రూ.2600 వరకు వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ ధర వేరుశెనగకు రూ.6,350 ఉంది. అయితే నాణ్యత, పరిమాణం పేరుతో వ్యాపారస్తులు ధరలను అమాంతంగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రభుత్వ మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వేరుశనగ సాగు గిట్టుబాటు కావడం లేదు..

ప్రస్తుతం వేరుశనగ సాగు గిట్టుబాటు కావడం లేదు. విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీల ఖర్చు భారీగా పెరిగాయి. ఎకరాకు రూ.40 వేలు వరకు పెట్టుబడి వచ్చింది. ఈ కారణంగా ఎకరాకు 10 నుంచి 15 బస్తాలు దిగుబడులు వస్తే నష్టం వస్తోంది. కావున ప్రభుత్వం స్పందించి సాగు చేసిన రైతులకు పరిహారం అందించాలి.

- చంద్రమౌళి, రైతు, సుంకేసుల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల దిగుబడి వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. వేరుశెనగ దిగుబడులు తగ్గినట్లు మా దృష్టికి వచ్చింది. దిగుబడి పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు వివరిస్తా.

- శివమోహన్ రెడ్డి, ఎఒ, సింహాద్రిపురం

నడకతో సంపూర్ణ ఆరోగ్యం : వాకర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నడకతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు శారీరక, మానసిక దృఢత్వం లభిస్తుందని వాకర్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ మురళీమోహన్‌రావు తెలియజేశారు. ఆదివారం బోయినపల్లిలోని శాన్వి ఇంటర్నేనల్ పాఠశాలలో వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొండూరు శరత్ కుమార్‌రాజు ఆధ్వర్యంలో 157 వ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మురళి మొహన్‌రావ్ పాల్గొని మాట్లాడారు. రాజంపేట, పొరుగు మండలాలలో కొండూరు శరత్ కుమార్ రాజు నడకపై కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. వాకర్స్ అసోసియేషన్ ద్వారా వారు చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శనీయమని కొనియాడారు. అనంతరం శరత్ కుమార్ రాజును శాలువా, పూలమాలతో అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి ప్రదీప్ కుమార్, కోశాధికారి ఎస్.ఎం అక్బర్ పాల్గొన్నారు.



శరత్‌కుమార్‌రాజును సన్మానిస్తున్న వాకర్స్ సభ్యులు

'మిట్స్'కు అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ బహుమతి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

ప్రజాశక్తి- మదనపల్లి

మిట్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో ఉన్న పనిమలర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ప్రతిభ కనపరిచి బెస్ట్ పెరఫార్మర్ బహుమతి పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. బి.టెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్న మోహన్, నితిన్, శ్యాం ప్రసాద్, దీక్షిత, సింధు తమ పరిశోధన పత్ర పరిశోధనను వివరించినందుకు గాను బెస్ట్ పేర్మర్ అవార్డును అందుకున్నట్లు ఆయన అన్నారు. గెలుపొందిన విద్యార్థులను కరెస్పాండెట్ డాక్టర్. యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ కల్పన అభినందించారు.

శక్తిని ఆదా చేసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

శక్తి పరిరక్షణ మానవ ఉనికికి ముఖ్యమైన అంశమని, శక్తిని ఆదా చేసుకోకుండా భవిష్యత్తులో మనుగడ సాగించడం కష్టమని, ప్రతి ఒక్కరు శక్తిని ఆదా చేసేందుకు ప్రయత్నించాలని ఫ్యూచర్ మైండ్స్ పాఠశాల అధినేత నందకిశోర్ అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు కె. జయలక్ష్మి ఆధ్వర్యంలో ఎనర్జీ క్లబ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ఎనర్జీ క్లబ్ వివేకవంతమైన మరియు స్థిరమైన శక్తి వినియోగం కోసం అవగాహన కల్పించడం, వ్యాప్తి చేయడమే లక్ష్యమని తెలిపారు. ఫ్యూచర్ మైండ్స్ పాఠశాల అధినేత నందకిషోర్ మాట్లాడుతూ భావితరాల కోసం శక్తిని ఆదా చేసుకోవాలని సూచించారు. భూమిపై పరిమితమైన శక్తి సరఫరా ఉందని, పునరుత్పత్తికి చాలా సమయం పడుతుందని, కాబట్టి భవిష్యత్తు తరాలకు అందుబాటులో ఉండే శక్తిని ఆదా చేయడం చాలా అవసరమని తెలియజేశారు. అనంతరం శక్తి ఆదా అంశంపై విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసుల రూట్ మార్చ్

ములకలచెరువు : ఎస్‌పి కృష్ణారావు ఆదివారం ములకల చెరువు నుంచి మదన పల్లెకు పోలీసులతో రూట్ మార్చ్ (ఎఎస్ఎల్) నిర్వహించారు. సిఎం జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం మదనపల్లిలో సిద్ధం సభకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో భద్రతా చర్యల దృష్ట్యా ఎస్‌పి నేతృత్వంలో అడిష నల్ ఎస్‌పి రాజ్ కమల్, డిఎస్‌పి ప్రసాద్ రెడ్డి, ట్రైనీ డిఎస్‌పి ప్రశాంత్, సిఐలు మధు, సద్గురుడు, శేఖర్, వల్లి బాషా, యువరాజ్‌తో పాటు ఎస్‌ఐలు తిపే స్వామి, శివకుమార్, చెన్నకేశవ, మల్లికార్జున రెడ్డి రూట్ మార్చ్ నిర్వహించారు.

భూ తగాదాలో ఇద్దరు రైతుల ఘర్షణ

- ఒకరికి కొడవలి పోట్లు.. పరిస్థితి విషమం

ప్రజాశక్తి-మదనపల్లి

మండలంలోని పాలెంకొండలో రెవెన్యూ మోసాలకు సామాన్య రైతుల మధ్య భూ విభేదాలు తలెత్తాయి. ఇద్దరి గొడవ తారాస్థాయికి చేరడంతో ఓ రైతును మరో రైతు కొడవలితో అందరికీ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుని వివరాల ప్రకారం.. పాలెం కొండకు చెందిన రైతు బి. నాగరాజుకు వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమి ఊరికి సమీపంలో ఉంది. పక్కనే నాలుగు లైన్ల జాతీయ రహదారి వెళుతూ ఉండడంతో భూములకు అమాంతంగా రేట్లు పెరిగాయి. ఆ భూమిపై కన్నేసిన చిన్నప్ప, మురళి, చిన్నక్కలు నాగరాజు పొలాన్ని ఆక్రమించుకోవడానికి కుట్రపన్నారు. రెవెన్యూ అధికారుల సాయంతో గుట్టుగా భూమిని తమపేరుపై ఆన్‌లైన్‌లో మార్చుకున్నారు. అంతటితో ఆగకుండా వారు ఆదివారం భూమిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తుండడంతో నాగరాజు అడ్డుకున్నాడు. ఇద్దరి మధ్య గొడవ జరగడంతో నాగరాజుపై చిన్నప్ప మురళి కొడవళ్లతో దాడి చేశారు. ఈ సంఘటనలో బాధితుడి తల, చేతి వేళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ బాధిత రైతును కుటుంబీకులు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి చికిత్స అనంతరం అతని పరిస్థితి విషమించడంతో తిరుపతికి రిఫర్ చేశారు.. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన రైతు నాగరాజు

బిజెపి భావోద్వేగ రాజకీయాలను తిప్పికొట్టాలి

- ఇండియా కూటమి సమావేశంలో వక్తల పిలుపు

ప్రజాశక్తి - కడప

భారత రాజ్యాంగ పీఠికలోని ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, స్వావంబలన, సామాజిక న్యాయం, సోషలిజం లక్ష్యాలను విస్మరించి దేశాన్ని విభజించి పాలించడం, భావోద్వేగ రాజకీయాలను నడుపుతోందని, వీటిని తిప్పికొట్టాలని వక్తలు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యం ప్రాబల్యం కల్గిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఇండియ కూటమి ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి పదేళ్ల పాలనలో ప్రభుత్వ వ్యవస్థలన్నిటినీ ప్రయివేట్ పరం చేసిందన్నారు. నేడు విపక్షాలను అనిచేందుకు రాజ్యాంగ వ్యవ స్థలను వాడుకునే బిజెపి చెంచా యుగంపై పోరాటం ఉమ్మడిగా చేయాల్సిన చారిత్రిక పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో టిడిపి, బిజెపితో బహిరంగ పొత్తు, వైసిపి రహస్య పొత్తు, రాష్ట్ర అభివృద్ధికి ప్రమాదంగా పరిణమించిందని పేర్కొన్నారు. కడప జిల్లా అభివృద్ధి పట్టించుకోని పాలక, ప్రతిపక్ష పార్టీలు జిల్లా ప్రజల కళ్ళకు గంతలు కట్టి ఓట్లు అడుగుతున్న వైనం నేడు చూస్తున్నామని వారు ఎద్దేవా చేశారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ ఊసే లేదని, జిల్లాలో పారిశ్రామిక వాడ మూతలు పడి విలవిలలాడుతోందని, కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్క్ ఎదుగు పొదుగు లేకుండా ఉందని, చెన్నూరు షుగర్ ఫ్యాక్టరీ మూలన పడ పోయిందని వాపోయారు. ప్రొద్దుటూరు, పోరు మామిళ్ల పాల ఫ్యాక్టరీలు కనుమరుగైపోయాయని పేర్కొన్నారు. మైదుకూరు దానా పరిశ్రమ, వనిపెంట ఇత్తడి పరిశ్రమ నిర్వీర్యం అయి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పులివెందుల యురేనియం ప్రాజెక్టు అక్కడి నీటిని, గాలిని విష తుల్యం చేశాయని పేర్కొన్నారు. పాడా అవినీతితో కూరుకుపోయిందని, కడప కలెక్టర్ సంతకాలు జిల్లాలో అధికార పార్టీ పెద్దలు చేసి ఎన్‌ఒసిలులు సృష్టిస్తున్నారని పత్రికల్లో వార్తలు చూస్తున్నామని తెలిపారు. ప్రయివేట్ ల్యాండ్స్ సైతం భూకబ్జాలకు గురవుతూ ఉంటే పీడీయాక్ట్ పెట్టలేని నిస్సహాయ పరిస్థితుల్లో రెవెన్యూ అధికారులు ఉన్నారని, ఇవి చాలవంటూ ల్యాండ్ టైటిల్ చట్టం తెచ్చి పేదల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములు చట్టబద్ధంగా లాక్కొవడానికి చూస్తున్నారని చెప్పారు. స్మార్ట్ మీటర్ల పేరిట వ్యవసాయాన్ని పాలకులే సంక్షోభంలోకి నెట్టుతు న్నారని వారు విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు జీర్ అహ్మద్, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి.చంద్ర, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎన్.తిరుపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ సత్తార్, విష్ణు ప్రీతమ్ రెడ్డి, చీకటి చార్లెస్, సుజాతరెడ్డి , చిన్న కుల్లాయప్ప, శ్యామలాదేవి, అలీ ఖాన్, సలావుద్దీన్, న్యాయవాది సుధాకర్, నాగరత్న, గౌరీ, సిపిఎం నాయకులు ఎ.రామ్మోహన్, బి.మనోహర్, సిపిఐ నాయకులు వెంకటశివ, బాదుల్లా, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న ఇండియా కూటమి సభ్యులు

అండగా నిలిచేవారికే మా మద్దతు

- విభిన్న ప్రతిభావంతులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

డిమాండ్లు నెరవేర్చి, అండగా నిలిచిన వారికే రాజకీయంగా తమ మద్దతు ఉంటుందని విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుణశేఖర్ తెలియజేశారు. రాజంపేట విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం ఆధ్వర్యంలో వికలాంగుల ఆత్మీయ సమావేశం ఆదివారం న్యూ ఆంధ్ర కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గుణశేఖర్ మాట్లాడుతూ తమకు ఏ ప్రభుత్వంనూ సరైన న్యాయం జరగడం లేదన్నారు. వికలాంగులకు రాజకీయ శూన్యత ఏర్పడిందని తెలిపారు. సమాజంలో అందరికంటే వెనుకబడిన సమాజం వికలాంగుల సమాజమని అన్నారు. వికలాంగులకు రూ 6 వేలు పింఛన్, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అంత్యోదయ స్కీం ద్వారా రేషన్ కార్డులు అందించాలని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలలో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని, 2016 చట్టం ప్రకారం వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. పిడబ్ల్యుడి ఫెడరేషన్ ఉపాధ్యక్షులు మురళి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎవరైతే వికలాంగులకు సరైన మేనిఫెస్టో ఏర్పాటు చేస్తారో వారికి తాము అండగా ఉంటామని అన్నారు. రాజంపేట ఉపాధ్యక్షులు అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ వికలాంగులకు విద్యా అవకాశాలు కల్పించాలని, వికలాంగులు కార్పొరేషన్ ద్వారా లోన్లు, బడ్జెట్లలో రిజర్వేషన్ ప్రకారం 5(ఐదు) శాతం బడ్జెట్ కేటాయించాలని పేర్కొన్నారు. జాతీయ క్రీడాకారుడు శివకోటి మాట్లాడుతూ పారా స్పోర్ట్స్ వికలాంగులకు సరైన సౌకర్యాలు కల్పించాలని, సరైన బడ్జెట్ కల్పించాలని, ప్రోత్సాహకాలు అందించాలని, సాధారణ క్రీడాకారులకు అందించే రిజర్వేషన్ను వర్తింపచేయాలని కోరారు. ఈ ఆత్మీయ సమావేశంలో పుల్లంపేట మండలం అధ్యక్షులు మల్లు సుబ్బనరసా రెడ్డి, పెనగలూరు అధ్యక్షులు తిరుపాల్, ఒంటిమిట్ట అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, గౌరవాధ్యక్షులు తిరుమల్ రెడ్డి, రెహమాన్, ప్రసాద్ పాల్గొన్నారు.



అభివాదం తెల్పుతున్న విభిన్న ప్రతిభావంతులు

డాక్టర్ యోగేష్‌బాబుకు గ్లోబల్ ఐకానిక్ పురస్కారం

ప్రజాశక్తి-పీలేరు



పీలేరుకు చెందిన డాక్టర్ యోగేష్ బాబు తుంగకు యాడొక్సియా, స్టెల్లార్ ఫిలిమ్స్, ముంబై 'గ్లోబల్ ఐకానిక్' పురస్కారం అందుకున్నారు. యోగేష్ బాబు అకాడమిక్, మేనేజ్మెంట్ విభాగం ఫైన్ ఆర్ట్స్, మీడియా, రీసెర్చ్, కమ్యూనికేషన్ రంగాలలో ఆయన అదించిన కృషిని గుర్తించి ఈ అవార్డు వరిచింది. మార్చి 30న ముంబాయిలో జరిగిన యుడోక్సియా కామ్ 4 -2024 అంతర్జాతీయ కాన్ఫరెన్స్ (హైబ్రీడ్ మోడ్)లో అతనికి ప్రదానం చేశారు. డాక్టర్ యోగేష్ బాబు తుంగ ప్రస్తుతం యుడొక్సియా రీసెర్చ్ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ చేస్తున్నారు. గతంలోనూ ఆయన ఫైన్ ఆర్ట్స్, మీడియా, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్ రంగాల్లో చేసిన సేవలకు పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులు దక్కాయి. ఈ సందర్భంగా ఆదివారం పీలేరు పట్టణ ప్రముఖులు, బంధువులు, శ్రేయోభిలాషులు డాక్టర్ యోగేష్ బాబు తుంగాను అభినందించారు. తండ్రి రాధాకృష్ణ తుంగ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేసి ఎంతోమంది విద్యార్థులను ఉన్నత కళాకారులుగా తీర్చిదిద్దారు.

బిజెపి నేత భగవాన్‌పై ఎన్నికల ఉల్లంఘన కేసు

ప్రజాశక్తి-మదనపల్లి

బిజెపి భగవాన్‌పైఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసును పోలీసులు నమోదుచేశారు. తాలూకా సిఐ ఎన్. శేఖర్ వివరాల ప్రకారం.. బిజెపి రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి మదనపల్లి మీదుగా కలికిరికి శనివారం వెళ్లారు. ఈ నేపథ్యంలో మదనపల్లి నియోజకవర్గ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ భగవాన్ తొమ్మిది వాహనాలకు అనుమతి తీసుకుని, అనుమతి మేరకు కాకుండా వందల వాహనాలతో వెళ్లి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారు. మదనపల్లికి చెందిన ఎన్నికల పరివర్తనా యమావళి నోడల్ అధికారి ఎంపిడిఒ భాను ప్రకాష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భగవాన్‌పై పోలీసులు ఆదివారం ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై కేసు నమోదు చేశారు.

931 కిలోల వెండి, రూ. 21 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎన్నికల వేళ అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఆదివారం భారీగా వెండి, నగదు పట్టుబడింది. ఓ ఇంట్లో నిలువ ఉంచిన 931 కిలో వెండి, రూ.21లక్షలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అవి తమిళనాడుకు చెందిన వ్యాపారులు సంపత్, కన్నాకు చెందిన సొత్తుగా గుర్తించారు. పట్టుబడిన వెండి, నగదును జిఎస్‌టి, ఐటి శాఖ అధికారులకు అప్పగించారు.



పట్టుబడిన వెండి, నగదును తరలిస్తున్న పోలీసులు



శరత్‌బాబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

శరత్‌బాబు మరణం తీరని లోటు


ప్రజాశక్తి-రాజంపేట అర్బన్


రాజంపేట పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు రాజా శరత్ బాబు అకాల మరణం రాజంపేట వాసులకు తీరని లోటు అని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. స్థానిక జూలీ బజార్‌లోని సరస్వతి విద్యా మందిరంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రాజా శరత్ బాబు సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ వివిధ సంస్థల ద్వారా పట్టణంలోని వేలాదిమందికి తన సేవలందించిన సేవా రత్నం రాజా శరత్ బాబు అని కొనియాడారు. అనంతరం శరత్ బాబుకు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మానవతా చైర్మన్ పోకల ప్రభాకర్, సంస్థ అధ్యక్షులు లయన్ అబ్దుల్లా, కార్యదర్శి కే.సురేష్ కుమార్, కోశాధికారి యూపీ రాయుడు, ప్రతినిధులు శివరాజు, నందకిషోర్, వేణుగోపాల్ నాయుడు, గంగనపల్లి వెంకటరమణ, రమణయ్య, హెల్పింగ్ హాండ్స్ అధినేత పలుకూరి వెంకటరమణ, సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు జితేందర్ పాల్గొన్నారు.

శాలివాహనుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- వాల్మీకిపురం

శాలివాహనుల అభివృద్ధికి, హక్కుల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన శాలివాహన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రెడ్డెప్ప అన్నారు. ఆదివారం స్థానిక కుమ్మరవీధిలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతి వృత్తుల వారిపై ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని, పాలకుల నిర్లక్ష్యంతో మనం ఎంతగానో నష్టపోతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటేష్, గోవిందరాజు, వేణు, నరసయ్య, చంద్రబాబు, లక్ష్మయ్య, సోమశేఖర్, అర్జునయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.





గంగాద్రి నాయుడును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది

ప్రజాశక్తి- కలకడ

మండలంలోని బాటవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న గంగాద్రినాయుడు ఉద్యోగ విరమణ పొందడంతో ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని, ఆదర్శ ప్రాయమైనదని అన్నారు. ఉపాధ్యాయులు తమ మేధాశక్తిని విద్యార్థులకు బోధించి విద్యతో పాటు క్రమశిక్షణ నేర్పించి సమాజంలో ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దే గురువుగా నిలుస్తున్నారని అన్నారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా ఉద్యోగంలో చేరిన రోజే రిటైర్మెంట్ తేదీ కూడా ఖరారవుతుందని అన్నారు. అనంతరం రిటైర్డ్ అయిన గంగాద్రి నాయుడు దంపతులను పూలమాలలు , దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంతి ఎంఇఒ ఆదినారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయులు సరస్వతి, శ్రీనివాసులురెడ్డి, ప్రయివేట్ పాఠశాలల కరస్పాండెంట్లు అక్రమబాషా, నాగరాజ, ఎంపిపి శ్రీదేవి రవి కుమార్, మండలంలోని అన్ని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుల్లయ్య సేవలు ఎనలేనివి



పుల్లయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ ఇను కపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు ఆసంపల్లి పుల్లయ్య సేవలు మరువలేనివని రిటైర్డ్ ఎంఇఒ చెంగల్రెడ్డి, ఎంఇఒ నాగయ్య, అనంత కృష్ణ, నాగిరెడ్డిపల్లె సర్పంచ్ ఖలు సూర్య నారాయణ కొనియాడారు. పుల్లయ్య పదవి విరమణ ఆత్మీయ సభను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయనేతలు అల్లం అశోక్ కుమార్, మహాలక్ష్మయ్య, రౌఫ్‌బాషా, ఎంఎం అలీఖాన్, లీలాకృష్ణ, కృపానందం, షఫీఉల్లా, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ జాతర

ప్రజాశక్తి-బి. కొత్తకోట

కురబలకోట మండలంలోని ముదివేడులో శ్రీదండు మారెమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతర నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యేతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కలకడ

సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించాలని అఖిలభారత పంచాయతీ పరిషత్ ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ చిదంబరరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో సర్పంచ్‌ల సచివాలయాల సమన్వయంలోని రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ క్లినిక్, డెయిరీ, పంచాయతీ కార్యాలయ నిర్వహణ ఖర్చుల కోసం అదేవిధ జీతాలు, విద్యుత్ బిల్లులకు నిధులు, గౌరవ వేతనం పదివేలకు పెంచాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలలో గెలిచిన జడ్‌పిటిసి, ఎంపిటిసి, కౌన్సిలర్లకు ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటు హక్కు ఉన్నట్లుగా సర్పంచ్‌లకు కూడా ఓటు హక్కు కల్పించాలని కోరారు.

669 ఫిర్యాదులకు పరిష్కారం

-జిల్లా ఎన్నికల అధికారి అభిషేక్ కిశోర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై మొత్తం 705 ఫిర్యాదులు అందగా 669 ఫిర్యాదులను పరిష్కారం అందించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషేక్ కిశోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే రాయచోటి కలెక్టరేట్ లో జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై ప్రత్యేక దృష్టి సారించి వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు మొత్తం 705 ఫిర్యాదులు అందగా 669 ఫిర్యాదులను పరిష్కరించగా 36 ప్రగతిలో ఉన్నాయి అన్నారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్మెంట్ ప్రక్రియ ద్వారా కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.1.19 కోట్ల విలువైన నగదు, వస్తువులను సీజ్ చేశామన్నారు. ఇందులో రూ.51.8 లక్షల మేర నగదు, రూ.37లక్షల విలువైన లిక్కర్, రూ.1.40 లక్షల విలువైన గంజాయి, రూ.29.67 లక్షల బంగారు, వెండి, ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు తెలిపారు ఎంసిసి అతిక్రమణ క్రింద 8 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేశామని తెలిపారు.

కూటమితోనే బిసిల అభివృద్ధి సాధ్యం : 'మండిపల్లి'

ప్రజాశక్తి - రాయచోటి

తెలుగుదేశం పార్టీ, జనసేన, ఎన్‌డిఎ కూటమితోనే బిసిల అభ్యున్నతి సాధ్యమవుతుందని, బిసిల ఆత్మగౌరవాన్ని ఎప్పటికీ తగ్గనివ్వమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం మాధవరంలో జయహో బిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాంప్రసాద్ రెడ్డికి గ్రామ బిసిలు పూలదండలు కోలాటాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి బిసిల ప్రభుత్వం అని బిసిల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు మరింత మెరుగుపరచేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బిసిల డిక్లరేషన్ ఆశాన్ని తగ్గించి వారి రాజకీయ ఎదుగుదలను వైసిపి ప్రభుత్వం అడ్డు తగిందని ఆరోపించారు. గత తెలుగుదేశం పార్టీ బిసిలకు, వారి రాజకీయ ఎదుగుదలకు ప్రత్యేక భూమిక పోషించిందని, బిసిల ఆత్మగౌరవాన్ని ఎక్కడా తగ్గనివ్వమని, ఎప్పటికీ వారి వెంట నిలిచి అన్నివిధాలా వారి ఎదుగుదలకు కృషి చేస్తానన్నారు. మాధవరం గ్రామంలో వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న బిసి కుటుంబాలు ఎక్కువగా నివసిస్తున్నాయని పార్టీ అధికారంలోకి రాగానే ఇక్కడి వారందరికీ వెలుగులో ప్రాజెక్టు నుండి సాగునీరు, తాగునీరు అందిస్తామని చెప్పారు. టిడిపి అధికారంలోకి రాగానే మండల బిసిలకు సింహభాగాన్ని కేటాయిస్తామన్నారు.నాలుగు పర్యాయాలు గెలిచిన స్థానిక వైసిపి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి బిసిలకు ఏమిచేశారో చెప్పాలన్నారు. తెలుగుదేశం అధికారంలోకి రాగానే ప్రత్యేక బిసి రక్షణ చట్టం అమలులోకి తీసుకవచ్చి వైసిపి బానిస సంకెళ్ల నుండి బిసిలకు విముక్తి కలిగిస్తానని చెప్పారు. ఎవరితోను వ్యక్తిగత శత్రుత్వం ఎటువంటి విభేదాలు లేవని అనుభవం కార్యకర్తలకు, అభిమానులకు అండగా ఉన్నానని చెప్పారు. పార్టీ గెలుపుకోసం కష్టపడే ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటానని తెలిపారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజులఖాదర్‌బాషా, మాజీ సర్పంచ్ నాగేశ్వర్ నాయుడు, రవీంద్రారెడ్డి, రఘుపతి నాయుడు, మాజీ సర్పంచ్, రెడ్డప్ప నాయుడు, రంగారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు, హుస్సేన్ బాష, మైనారిటీ నాయకుడు, రేవన్న శివప్రసాద్, బిజెపి యువమోర్చా, వెంకట రంగయ్య, రామాంజులు, శివప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రమానాథ్, రమేష్, దుర్గా ప్రసాద్, రెడ్డి వరప్రసాద్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



రాంప్రసాద్‌రెడ్డికి నాగలిని బహూకరిస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా ఈస్టర్ పండుగ వేడుకలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా అన్ని చర్చిలు విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. మానవాళి కోసం సిలువలో ప్రాణ త్యాగం చేసిన యేసు క్రీస్తు చనిపోయిన మూడో రోజు సమాధి నుంచి తిరిగి లేచిన రోజున ఈస్టర్ పండుగ జరుపుకుంటారని ఫాదర్ విజయమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సెయింట్ జోసెఫ్ క్యాథలిక్ చర్చి, లూథరన్ చర్చి, మిస్పా చర్చి, మద్దిరివుల చర్చిలలో ఈస్టర్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సెయింట్ జోసెఫ్ క్యాథలిక్ చర్చి నందు రెవరెండ్ ఫాదర్ విజయమోహన్ రెడ్డి ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలను ఆరాధన నిర్వహించారు.ఈ సందర్భంగా క్రీస్తుప్రభువు పునరుద్ధానం చేసిన రోజు ఈస్టర్ అని క్రైస్తవులంతా కూడా పునరుత్థాన శక్తితో ఆధ్యాత్మికంగా పునీతులు కావాలని ఆయన అన్నారు. శాంతి, సహనం, పరస్పర సహకార గుణాలతో అన్ని వర్గాల వారు జీవించాలని సందేశాన్ని అందించారు. ఈస్టర్ పండుగ సందర్భంగా 40 రోజుల పాటు ఉపవాసాలు ఉన్న భక్తులు పొదుపు చేసిన ఆహార పదార్థాలు, నగదు, వస్త్రాలను పేదలకు దానం చేశారు.



సందేశాన్ని అందిస్తున్న రెవరెండ్ ఫాదర్ విజయమోహన్‌రెడ్డి

ఆటిజం పిల్లల పట్ల జాగ్రత్తలు అవసరం

రేపు అంతర్జాతీయ ఆటిజం అవేర్‌నెస్ డే సందర్భంగా..

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వయసుకు తగ్గట్టు పిల్లల్లో రావాల్సిన మానసిక ఎదుగుదల రాకుండా ఉండే పరిస్థితినే ఆటిజం అంటారని ప్రముఖ మానసిన వైద్య నిపుణురాలు డాక్టర్ ఎన్.కవితా ప్రసన్న తెలిపారు. ఇలాంటి పిల్లల పట్ల తల్లిదండ్రులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం అంతర్జాతీయ ఆటిజం అవేర్‌నెస్ డే సందర్భంగా డాక్టర్ 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఆటిజంను వాడుక భాషలో మందబుద్ధి అని కూడా అంటారన్నారు. పిల్లల మెదడులోని కొంత భాగం సరిగా పనిచేయక పోవడం వల్ల మా మూలు పిల్లాడిలా వ్యవహరించలేరని వివరిం చారు. ఈ వ్యాధి జన్యుపరమైన కారణాల వల్ల వస్తుందన్నారు. తల్లి గర్భిణిగా ఉన్నప్పుడు తీవ్రమైన ఉద్వేగాలకు లోనవ్వడం, నెలలు నిండకుండా శిశువు పుట్టడం వల్ల, ఒక్కొక్కప్పుడు వంశపారం పర్యంగా మొదటి శిశువుకు ఈ సమస్య ఉన్నప్పుడు రెండవ సంతానానికి కూడా ఆటిజం సమస్య రావచ్చన్నారు. ఎవ్వరితో కలువకుండా ఒంటిరిగా ఉండడం, నేరుగా కళ్లలోకి చూడలేకపోవడం, మాట్లాడలేకపోవడం ఇతరులతో కలిసేందుకు ఇష్టపడకపోవడం, ప్రతిస్పందన లేకపోవడం, ఎలాంటి అనుభూతి కలిగి లేకపోవడం, సరిగ్గా మాట్లాడలేకపోవడం, ఎవరినీ పట్టించుకోకపోవడం ఆటిజం లక్షణాలుగా తెలిపారు. శిశువుకు ఒకటిన్నర సంవత్సరం నిండక ముందే ఆటిజం లక్షణాలు కనిపిస్తాయన్నారు. పిల్లల ఎదుగదల విషయంలో తల్లి దండ్రులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిశువుకు మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఆరోగ్యవంతంగా ఎదగ డానికి వ్యాధి నిరోధక శక్తి పెరిగి మానసిక శారీరక ఎదుగుదలకు పౌష్టికాహారం అందించడం చాలా ముఖ్యమన్నారు. కండరాలు బలంగా ఉండేం దుకు ఐరన్ ఉండే ఆహార పదార్థాలను ఇవ్వాల న్నారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, తాజా పండ్లు ఇస్తూండాలన్నారు. తల్లులు తమ పిల్లల్లో ఆటిజం నివారించడానికి గర్భధారణ సమ యంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకో వడంతోపాటు వత్తిడిని తగ్గించుకోవాలని సూచించారు. శారీరక శ్రమ కోసం ఇంటిపని, వంటపని, తోటపని వంటివి చేస్తూండాలన్నారు. ధూమపానం, ఆల్కహాల్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. శిశువు కదలికలను కూడా ఎప్పటి కప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. వీటితోపాటు తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. ముఖ్యంగా గర్భ ధారణ సమయంలో తల్లి, పుట్టాక పిల్లలు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. ఆధునిక కాలంలో సెల్‌ఫోన్ వల్ల చాలా సమస్యలు వస్తున్నా యన్నారు. ఉమ్మడి కుటుంబాల్లో ఆటిజం సమస్య తక్కువగా ఉంటుందన్నారు. పిల్లలు సాధారణంగా ప్రవర్తించకపోతే వెంటనే అప్రమత్తం కావాలని వెంటనే వైద్యులను సంప్రదించాలని డాక్టర్ కవితా ప్రసన్న సూచించారు. కొన్ని ప్రత్యేకమైన థెరపీల ద్వారా పిల్లల్లో సామాజిక నైపుణ్యాలను మెరుగు పరచాలన్నారు. వైద్యుల సలహాల మేరకు ఆటిజంకు చికిత్స తీసుకుంటూ అవసరమైన జాగ్రత్తలు పాటిస్తే ఈ సమస్య నుంచి పిల్లలను కాపాడుకోవచ్చని డాక్టర్ కవితా ప్రసన్న తెలిపారు.



డాక్టర్ ఎన్.కవితా ప్రసన్న

టిడిపి గెలుపునకు కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జె.వెంకటేష్

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కూటమి ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా గెలవాలని టిడిపి, జనసేన నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం వలసపల్లిలో ఏర్పాటు చేసిన నాయకులు, కార్యకర్తలు సమావేశానికి షాజహాన్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనతోపాటు టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, జనసేన నాయకులు శ్రీరామ రామాంజనేయులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారని అన్నారు. అధిక ధరలతో సామాన్యుల నడ్డి విరిచారని, నియోజకవర్గ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని అన్నారు. గతంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత షాజహాన్‌బాషాకే దక్కుతుందన్నారు. అనంతరం షాజహాన్ బాషా మాట్లాడుతూ వైసిపి అవినీతి పాలనలతో రాష్ట్ర అభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నాని పేర్కొన్నారు. లంచాలు ఇస్తే తప్ప సామాన్యులకు పని జరిగే పరిస్థితి లేదన్నాని అన్నారు.రెవెన్యూలో అవినీతి పేరుకుపోయిందని,అధికారుల తీరుతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో పయనించాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గ సమస్యలపై తనకు సంపూర్ణ అవగాహన ఉందని, తనను ఆశీర్వదిస్తే సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని తెలిపారు.

రేపు సిఎం 'సిద్ధం సభ'ను విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి

ప్రజాశక్తి- రామసముద్రం

మదనపల్లిలో మంగళవారం మదనపల్లిలో జరిగే సిఎం జగన్ మోహన్‌రెడ్డి సిద్ధం సభ విజయవంతం చేయాలని మదనపల్లి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఆర్. నడింపల్లిలో జరిగిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ సిఎంను చేయాలంటే ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. సచివాలయాలు, ఆర్‌బికె కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారని అన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలలను దాదాపు 20 వేలకోట్ల రూపాయలతో అభివృద్ధి చేశారని, అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఉచితంగా ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలు చేయించారని చెప్పారు. ఈ సమావేశంలో సింగిల్ విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, వైస్ ఎంపిపి వెంకటరమణ రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు కొండూరు క్రిష్ణారెడ్డి, మాజీ కన్వీనర్ భాస్కర్ గౌడు, సి హెచ్.ప్రకాష్, జిల్లా బిసి వైసిపి ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్‌లు రెడ్డెప్పనాయుడు ,శ్రీనివాసులు రెడ్డి,సుబోస్ గెవన్న, దొడ్డిపల్లి ఆనంద,జికె చంద్ర,తిప్పరాజు, ఎంపిటిసిలు విశ్వనాథరెడ్డి, రెడ్డెప్ప,ఈశ్వర్ రెడ్డి, క్రిష్ణమూర్తి, షంషీర్, నాయకులు దర్శన్ ,క్రిష్ణప్ప, శివ, నారాయణస్వామి పాల్గొన్నారు.



నాయకులతో మట్లాడుతున్న దేశాయ్ తిప్పారెడ్డి

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

పీలేరు : రాష్ట్రాభివృద్ధి టిడిపి అధ్యక్షులు చంద్రబాబుతోనే సాధ్య మవుతుందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పీలేరు పట్టణం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుభవం, బాధ్యతగా ఉన్న నేతగా మన కోసం చంద్రబాబుచేసే పోరాటంలో మనమంతా ఆయనకు అండగా నిలవాలని అన్నారు. సిఎం జగన్ అసమర్థ, అవినీతి పాలనతో ప్రజల జీవితాలు వెనక బడ్డాయని, అభివృద్ధి నిలిచి పోయిందని పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాలు అభివృద్ధిలో దూసుకుపోతుంటే మన రాష్ట్రం వెనకబడి పోయిందని, జగన్ పాలనతో ప్రజల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు బాబురెడ్డి, పురం రామ్మూర్తి, సురేష్ కుమార్ రెడ్డి, లక్ష్మీకర, హేమ చంద్రారెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, శ్రీనాథ్‌రెడ్డి, సివి రెడ్డి, రెడ్డిశంకర్, భాస్కర, అప్పస్వామి, చంద్రయ్య, గాండ్ల విజయ్ కుమార్, మల్లికార్జున రెడ్డి, వెంకటేష్, హరి, హనీఫ్, షరీఫ్, ప్రసాద్ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి : సిఐ

ప్రజాశక్తి-మదనపల్లి

రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సిఐ యువరాజ్ పేర్కొన్నారు. ఆదివారం కేంద్ర సాయుధ బలగాతో పట్టణంలోని ప్యారా నగర్, మెట్రో కాంప్లెక్స్, మార్పురి వీధి, ఇందిరానగర్, కృష్ణానగర్, జుడిషియల్ కాలనీ, ప్రశాంత్ నగర్, మాయాబజార్, టిప్పు సుల్తాన్ మైదానం వరకు కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని ఆయన సూచించారు. ప్రజలకు ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునేందుకు పోలీసు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలు ఎటువంటి భయభ్రాంతులకు గురి కాకుండా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. పట్టణంలో ఎటువంటి ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మదనపల్లి టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య పోలీసు సిబ్బంది, కేంద్రబలగాలు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు




గ్రామ నాయకులను టిడిపిలోకి ఆహ్వానిస్తున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-గుర్రంకొండ

మండలంలోని టి.రాజుపల్లి,రామాపురం, తరిగొండ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పక అమలు చేస్తా మనే నమ్మకంతో ప్రజలు తమ పార్టీని ఆదరిస్తున్నారని అన్నారు. పీలేరు టిడిపి అభ్యర్థిగా తనను, రాజం పేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తరిగొండ ఎంపిటిసి రమణారెడ్డి, నారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, శివారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, రెడ్డి మోహన్ రెడ్డి, శ్రీనివా సులరెడ్డి, నరసింహారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, చిన్నరెడ్డెప్పరెడ్డిలు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలోకి..



టిడిపిలో చేరిన వారితో రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం : మండలంలోని చాకిబండకు చెందిన పలు మైనార్టీ కుటుంబాలకు చెందిన టిడిపి వర్గీయులు అమానుల్లా ఆధ్వర్యంలో రాయచోటి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. పార్టీలో చేరిన అల్లా బకస్, సాయిపీర్, మునఫ్, ఆసిన్, మసూద్, ఖదీర్, వెంక టరెడ్డి, చిన్న పరెడ్డి, అక్కుల్ రెడ్డి,ఆంజనేయులు రెడ్డి, పాపిరెడ్డి, భారత్, మనోజ్ రామానుజులు, శశి, అంజి లు రాంప్రసాద్ రెడ్డి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయశంకర్, రెడ్డయ్య, వెంక టాద్రి, అమర్నాథ్ రెడ్డి, అప్పారెడ్డి, హర్షద్, రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

'నల్లారి'ని కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి-ములకలచెరువు

చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో రాజంపేట పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని ఆదివారం తంబళ్లపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పోతుల సాయినాథ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లా డుతూ నియోజకవర్గంలో జరగబోయే ఎన్నికల గురించి కిరణ్ కుమార్‌రెడ్డితో చర్చించినట్లు తెలిపారు. నల్లారిని కలిసిన వారిలో సాయినాథ్ వెంట జనసేన నాయకులు లక్ష్మణ్, అనిల్, రాజు, రెడ్డిశేఖర్, బావాజీ, పవన్ రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

50 కుటుంబాలకు రంజాన్ తోఫా

ప్రజాశక్తి-సుండుపల్లె

మండలపరిధిలోని సిద్ధారెడ్డి గారి పల్లిలోని 50 పేద ముస్లిం కుటుం బాలకు రంజాన్ తోఫా మండల నాయకుడు ఎర్రపురెడ్డి శరత్‌గిరిరెడ్డి అందించారు. రంజాన్ మాసం ప్రారంభం నుంచి 40 రోజులు కఠిన ఉపవాస దీక్షలతో ఉండే పేద ముస్లిం కుటుంబాలకు తోఫా ఇవ్వడం నా పూర్వజన్మ సుకృతమని అన్నారు. రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవానలి ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముస్లిం నాయ కులు పాల్గొన్నారు.



రంజాన్ తోఫా అందిస్తున్న శరత్‌గిరిరెడ్డి

నవోదయ ఫలితాల్లో 'మురళి కోచింగ్ సెంటర్' ప్రభంజనం

ప్రజాశక్తి - రాయచోటి

పరీక్షలు ఏవైనప్పటికీ ఫలితాలు మాత్రం మురళీ కోచింగ్ సెంటర్‌కే సొంతం అని కరస్పాండెంట్ సరితాదేవి పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షా ఫలితాలలో మురళి సైనిక్ అండ్ నవోదయ కోచింగ్ సెంటర్ నుంచి 53 మంది విద్యార్థులు 200 మార్కులకు పైగా సాధించి ప్రభంజనం సృష్టించారని చెప్పారు. అందులో 250పైగా మార్కులతో 12 మంది విద్యార్థులు విజయ దుందుభి మోగించారన్నారు. తాజాగా ఆదివారం విడుదలైన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలలో మురళి నవోదయ అండ్ సైనిక్ కోచింగ్ సెంటర్ నుంచి 10 మంది విద్యార్థులు సీట్లు సాధించారన్నారు. జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలలో తమ కోచింగ్ సెంటర్ నుంచి వెంకట లిఖిత్ హిమకేష్, భరత్ ,చైత్ర శ్రీ, మనోజ్, యశస్వినిశ్రీ, అభిరామ్, లక్ష్మీదీపక్, హేమంత్, దీక్షిత అర్హత సాధించారన్నారు. అటు ఆల్ ఇండియా సైనిక్ ప్రవేశ పరీక్ష ఫలితాలతో పాటు ఇటు జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలలో కూడా ఇంతటి అద్భుతమైన ఫలితాలు సాధించేందుకు కృషిచేసిన అధ్యాపక బృందాన్ని, సహకరించిన తల్లిదండ్రులను మురళి సైనిక్ అండ్ నవోదయ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ అభినందించారు.

వైసిపి పాలనంతా అవినీతిమయం

మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

వైసిపి ప్రభుత్వ ఐదేళ్ల పాలన అవినీతి, అక్రమాలు, అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలతో సాగిందని రాయచోటి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్ఎన్ కాలనీలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడచిన ఐదేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలోని ఏ వర్గానికి న్యాయం చేసిన దాఖలాలు లేవన్నారు. దోచుకో దాచుకో అనే విధంగా వైసిపి పాలన సాగిందని, రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసినా వైసిపి నేతల భూకబ్జాలు, ఇసుక, మట్టి అక్రమ రవాణాలు, మద్యం మాఫియా, గంజాయి మాఫియాలతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. ప్రధానంగా పోలవరం, హంద్రీ-నీవా ,గాలేరు-నగరి సుజల స్రవంతి తదితర ప్రాజెక్టులతో పాటు అన్నమయ్య జిల్లా పరిధిలో వరదలకు కొట్టుకుపోయిన పింఛ, అన్నమయ్య ప్రాజెక్టులపై కూడా ముఖ్యమంత్రి జగన్ పూర్తిస్థాయి నిర్లక్ష్యం మనకు కనబ డుతోందన్నారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేసిన దాఖలాలు లేవన్నారు. అధికారంలోకి వస్తే రైతన్నలకు అండగా నిలు స్తామని, ప్రాజెక్టులు పూర్తి చేసి సాగునీరు, తాగునీరు అందిస్తామని గొప్పలు చెప్పిన ముఖ్య మంత్రి ప్రాజెక్టులు ఊసే ఎత్తకుండా రైతన్నలకు తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, సంబేపల్లి సర్పంచ్ నాగేశ్వరరావు, బిజెపి నేతలు నిర్మల్ కుమార్, శివప్రసాద్, రమణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

బాహుదానదిలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలోని చింతపర్తిలో చోటు చేసుకొంది. వివరాలు.. మండలంలోని చింతపర్తి బాహుదానదిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి శవమై తేలాడు. గమనించిన గ్రామస్తులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆ వ్యక్తి ఎరుపు రంగు టీషర్టు, నీలంరంగు ఫుల్ కట్ డ్రాయర్, కాళ్లకు బెల్టు చెప్పులు ధరించి ఉన్నాడు. ఆ వ్యక్తి ఎడమ చేతిపైన రాము లమ్మ, బాలరాజు అని తెలుగులో పచ్చబొట్టులు ఉన్నాయని, ఆవ్యక్తి ఆచూకీ గుర్తించిన వారు సిఐ పులిశేఖర్ 9440796714, ఎస్ఐ నాగేశ్వరరావు 9440900712లను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు. మృతుడు నీళ్లలో పడి రెండు, మూడు రోజులు అయి ఉంటుందని, ఇది ప్రమాదమా లేక హత్య చేసి పడేశారా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.